సాక్షి
నిజామాబాద్
శుక్రవారం । 4 । అక్టోబర్ । 2024



నేడు పీసీసీ చీఫ్ సన్మాన సభ

పీసీసీ చీఫ్ హోదాలో తొలిసారి జిల్లాకు వస్తున్న మహేశ్‌గౌడ్‌ను ఘనంగా సన్మానించనున్నట్లు డీసీసీ అధ్యక్షుడు మానాల తెలిపారు.

- 8లో ▸



'డిజిటల్ కార్డు' సర్వే షురూ

ఫ్యామిలీ డిజిటల్ కార్డుల జారీ కోసం జిల్లాలో సర్వే ప్రారంభమైంది. కలెక్టర్ హనుమంతు పర్యవేక్షించారు.

- 8లో ▸

గరిష్టం/కనిష్టం
33.8 /21.7

వాతావరణం

ఉదయం చల్లని గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. అక్కడక్కడ వర్షం కురిసే అవకాశాలున్నాయి.

చిన్నప్పుడు మహరాజ్ దగ్గర్నే ఉన్న..



నేను చిన్నప్పుడు మహరాజ్ దగ్గర్నే ఉన్న. మా బాపుకి పానం మంచిగలేక పోతే పోయినం. మమ్ముల్ని ఆశ్రమం లోనే పెట్టుకున్నడు. మా బాపు మంచిగైనంక ఇంటికి పోయిండు. నేను మహరాజ్‌తోనే ఉన్న. ఇవన్నీ మహరాజ్ కష్టపడి డెవలప్ చేసిండు. ఎప్పుడూ ఎంతో మంది సాధువులు వస్తుంటారు. ఇప్పుడు శాస్త్రి మహరాజ్, మంగళ్ బాబా ఉన్నరు. కొత్తగా పుట్టుకొచ్చిన కమిటీలు, ట్రస్టులు అన్నీ నకిలీవే.

– జిల్లపురం సంతోష్, గోవూర్



15 మందిని చదివించిండు..



సారంగాపూర్‌ల ఉన్న ఆర్‌బీసీని బంద్ చేస్తే రామ్‌ప్రియదాస్ మహరాజే మమ్ముల్ని చదివించిండు. మొత్తం 15 మందిమి పోరగాళ్లం ఉంటుంటిమి. సాధువులు మాకు మస్తు బుద్ధి చెప్పిన్రు. రామ్‌ప్రియదాస్ మహరాజ్ కాలం చేసినంక శాస్త్రి మహరాజ్, మంగళ్‌బాబా ఆశ్రమ బాగోగులు చూస్తున్నరు. అచ్చినోళ్లందరికి అన్నం పెట్టి పంపిస్తరు. వాళ్లే ఆశ్రమాన్ని నడిపేది.

– కుమ్మరి యాదగిరి, అలూర్

దేవీ నమోస్తుతే..



దేవీశరన్నవరాత్రి ఉత్సవాలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ప్రత్యేకంగా అలంకరించిన మండపాల్లో అమ్మవారు కొలువుదీరారు. ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. తొమ్మిది రోజులపాటు కొనసాగనున్న ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు దీక్ష స్వీకరించారు.

సాధువుల భూములపై భూ రాబందులు

- స్వాహా చేసేందుకు నకిలీ ట్రస్ట్ సృష్టించిన ఘనులు
- వివాదాస్పదం చేసి కోర్టు, అధికారులను తప్పుదోవ పట్టిస్తున్న వైనం
- రెండు దశాబ్దాలుగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న భక్తులు

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలు నిర్వహించే సాధువుల ఆశ్రమ భూములను వివాదాస్పదం చేసిన ఘనుల వ్యవహారం చర్చనీయాంశమైంది. వివరాల్లోకి వెళితే.. అయోధ్య సాధు పరంపరకు చెందిన రామ్‌ప్రియదాస్‌జీ మహరాజ్ త్యాగి సుమారు నాలుగు దశాబ్దాల క్రితం సారంగాపూర్ హనుమాన్ ఆలయం రోడ్డులో స్థలం కొనుగోలు చేసి బాలక్ రామానందాచార్య ఆశ్రమం ఏర్పాటు చేశారు. సర్వసంగ పరిత్యాగి అయిన రామ్‌ప్రియదాస్ మహరాజ్‌ను నమ్ముకున్న భక్తుల సంఖ్య భారీగా ఉండేది. ఉమ్మడి రాష్ట్రంలోని ఆయా ప్రాంతాలకు చెందిన వారితోపాటు ఉత్తరాదికి చెందిన సాధువులు, భక్తులు పెద్ద సంఖ్యలో వచ్చే వారు. ప్రతి ఏడాది కనీసం నాలుగు భారీ యజ్ఞ కార్యక్రమాలను ఆయన ఆధ్వర్యంలో నిర్వహించేవారు. ఈ క్రమంలో గోశాల, ఆశ్రమ నిర్వహణ కోసం రామ్‌ప్రియదాస్ మహరాజ్ సొంత డబ్బుతో ఎడపల్లి మండలం వడ్డెపల్లిలో 12.05 ఎకరాలు, నవీపేట మండలం లింగాపూర్‌లో 5 ఎకరాలు, ఆశ్రమానికి సమీపంలో సారంగాపూర్ వద్ద 5.05 ఎకరాల వ్యవసాయభూమిని కొనుగోలు చేశారు. ఆ భూములపై వచ్చే ఆదాయాన్ని ఆశ్రమం, గోశాల (సుమారు 30 నుంచి 40 గోవులు) నిర్వహణ, భక్తులకు ఆశ్రయం కల్పించేందుకు తదితర అవసరాలకు ఖర్చు చేసేవారు.



బాలక్ రామానందచార్య ఆశ్రమం

2005 జూన్‌లో మహరాజ్ కన్నుమూయగా, అయోధ్యకు చెందిన మహంత్‌లు, భక్తులు కలిసి సాధుపరంపరలో ఉన్న శాస్త్రి మహరాజ్‌ను పీఠాధిపతిని చేశారు. ఉత్తరాది ప్రాంతానికి చెందిన శాస్త్రి మహరాజ్ ఆశ్రమ నిర్వహణలో నిమగ్నం కాగా, భక్తులమని చెప్పుకుంటూ ఆశ్రమానికి వచ్చిన ఓ నలుగురు వ్యక్తులకు దుర్బుద్ధి పుట్టింది. అన్నీ తామే కావాలనే దురాశతో రామ్‌ప్రియదాస్ మహరాజ్ సొంతంగా ఆశ్రమ నిర్వహణ కోసం కొనుగోలు చేసిన భూములను వివాదాస్పదం చేశారు.

నాటకానికి తెరలేపింది ఇక్కడి నుంచే..

వడ్డేపల్లిలోని వ్యవసాయభూమి శాస్త్రి మహరాజ్ పేరుపైకి బదలాయింపు పూర్తయిన తరువాత ఆ నలుగురు తమ అసలు రూపాన్ని ప్రదర్శించారు. రామ్‌ప్రియదాస్ మహరాజ్ భూమిని శాస్త్రి మహరాజ్ తన పేరుపై చేయించుకుంటున్నారని, ఆయన వెళ్లిపోతారని ఇక్కడి భక్తులను తప్పుదోవ పట్టించారు. ఆరుగురు అమాయక భక్తులను ముందు పెట్టి తెరవెనుక నుంచి కథ నడిపించిన ఈ నలుగురు వ్యక్తులు 2006 సెప్టెంబర్‌లో ఓ నకిలీ ట్రస్టును రిజిస్ట్రేషన్ చేయించారు. ఆరుగురు భక్తుల్లో నలుగురు ఇప్పటికే మరణించగా, ఇద్దరు వ్యక్తులు అసలు ట్రస్టుతో తమకేమీ సంబంధం లేదన్నట్లు ఉండిపోయారు. ఆశ్రమంతో సంబంధం లేకుండా నకిలీ ట్రస్టును రిజిస్ట్రేషన్ చేయించిన సదరు నలుగురు ఘనులు, మరో 13 మందిని శాశ్వత ట్రస్టీలుగా పేర్కొన్నారు. ఇందులో నగరానికి చెందిన ప్రముఖ వ్యాపారిని అధ్యక్షుడిగా, ఆర్మూర్ ప్రాంతానికి చెందిన వ్యక్తిని ఉపాధ్యక్షుడిగా పేర్కొన్నారు. అయితే దురుద్దేశంతో ఉన్న సదరు నలుగురు వ్యక్తుల కుయుక్తులను గ్రహించిన శాశ్వత ట్రస్టీ కమిటీ అధ్యక్ష, ఉపాధ్యక్షులు తమకు ట్రస్టుతో సంబంధం లేదని, సాధువులతో సంబంధం లేని ట్రస్ట్ అసలుది కాదని అధికారులకు, కోర్టులకు లిఖితపూర్వకంగా స్పష్టం చేశారు. కథ అడ్డం తిరగడంతో ఆ నలుగురు వ్యక్తులు వ్యవహారాన్ని కోర్టులోకి లాగారు. హైకోర్టు సైతం ఈ వ్యవహారాన్ని రెవెన్యూ కోర్టుకు అప్పగించింది. ఓవైపు భక్తులుగా చలమణి అవుతూనే మరో వైపు రెవెన్యూ కోర్టును తప్పుదారి పట్టించే ప్రయత్నాలు చేస్తున్నారు.

పీఠాధిపతిని తప్పుదోవ పట్టించి..

రామ్‌ప్రియదాస్ మహరాజ్ తరువాత బాలక్ రామానంద ఆశ్రమ పీఠాధిపతి అయిన శాస్త్రి మహరాజ్‌ను నగరానికి చెందిన నలుగురు వ్యక్తులు తప్పుదోవ పట్టించారు. రామ్‌ప్రియదాస్ మహరాజ్ మూడు ప్రాంతాల్లో కొనుగోలు చేసిన భూమిని శాస్త్రిమహరాజ్ పేరుపైకి బదలాయించాలని చెప్పి, అందుకు కావాల్సిన పత్రాలు తయారు చేస్తామని నమ్మించారు. ఈ నలుగురు వ్యక్తులు కలిసి శాస్త్రి మహరాజ్‌ను రామ్‌ప్రియదాస్ మహరాజ్ కొడుకుగా పేర్కొంటూ డిపెండెంట్ సర్టిఫికెట్‌ను, డెత్ సర్టిఫికెట్‌ను తీసుకువచ్చారు. స్వతహాగా రామ్‌ప్రియదాస్ మహరాజ్ భక్తుడైన వడ్డేపల్లి రెవెన్యూ అధికారి ఆ సర్టిఫికెట్ల ఆధారంగా అక్కడి 12.05 ఎకరాల భూమిని నిబంధనల ప్రకారమే శాస్త్రి మహరాజ్ పేరుపైకి బదలాయించారు.

భక్తుల మనోభావాలతో చెలగాటం

ఆ నలుగురూ కలిసి బాలక్ రామానందాచార్య ఆశ్రమ భక్తుల మనోభావాలతో చెలగాటం ఆడుతున్నారు. రామ్‌ప్రియదాస్ మహరాజ్ కాలం నుంచి ఆశ్రమ భక్తులుగా ఉన్న వారు తీవ్ర ఆగ్రహానికి గురవుతున్నారు. పెద్ద మహరాజ్ తన సొంత డబ్బులతో ఆశ్రమ నిర్వహణ కోసం కొనుగోలు చేసిన భూములను సాధుపరంపరలో వచ్చే వారే పరిరక్షిస్తారని, వాటిపై స్థానికులకు హక్కు ఎలా ఉంటుందని ప్రశ్నిస్తున్నారు. నాటి నుంచి తాము అన్నీ చూస్తున్నామని, ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలో విచారణ చేపడితే అసలు విషయం తెలుస్తుందంటున్నారు. ఆయా ప్రాంతాల్లో భూమిని కౌలుకు చేస్తున్న వ్యక్తులు డబ్బులను సాధువులకు చెల్లిస్తూ, గోవులకు అవసరమైన గ్రాసాన్ని సమకూరుస్తున్నారు.

క్లుప్తంగా

ప్రారంభమైన ఓపెన్‌ స్కూల్‌ పరీక్షలు

నిజామాబాద్‌అర్బన్‌: జిల్లాలోని ఓపెన్‌ ఇంటర్‌, పదో తరగతి పరీక్షలు గురువారం ప్రారంభమయ్యాయి. పదో తరగతిలో తెలుగు పరీక్షకు 52 మందికి 41 మంది హాజరు కాగా 11 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. ఇంటర్‌ పరీక్షల్లో తెలుగు పరీక్షకు 81 మందికి 57 మంది హాజరు కాగా 24 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం నిర్వహించిన పరీక్షల్లో ఇంటర్‌లో అరబిక్‌ సబ్జెక్టు పరీక్ష నిర్వహించారు.

జిల్లాలో డీజేలు నిషేధం



ఖలీల్‌వాడి: జిల్లాలో సీపీ కల్మేశ్వర్‌ ఆదేశాల మేరకు డీజేలపై నిషేధం విధించినట్లు ఏసీపీ రాజావెంకట్‌రెడ్డి తెలిపారు. డీజే నిర్వాహకుల తోపాటు లైటింగ్‌ అండ్‌ సౌండ్‌సిస్టం దుకాణాల యజమానులకు జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్‌ భవన్‌లో గురువారం కౌన్సెలింగ్‌ ఇచ్చారు. భారీ సౌండ్‌కారణంగా వచ్చే ఆరోగ్య సమస్యలపై ఏసీపీ అవగాహన కల్పించారు. డీజేల నిర్వాహకులు తప్పనిసరిగా పోలీస్‌ కమిషనర్‌ నుంచి లైసెన్స్‌ అనుమతి తీసుకోవాలని స్పష్టం చేశారు. ఫంక్షన్స్‌కి కిరాయికి ఇచ్చేవారు ముందుగా పోలీసుల అనుమతి తీసుకోవాలన్నారు. అనుమతులు లేకుండా డీజే, సౌండ్‌ సిస్టమ్‌లు అద్దెకు ఇస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఒకటో టౌన్‌ ఎస్‌హెచ్‌వో రఘుపతి, టౌన్‌ సీఐ శ్రీనివాస్‌రాజ్‌, సౌత్‌ సీఐ సురేశ్‌కుమార్‌ తదితరులు పాల్గొన్నారు.

ఈ నెల 5లోగా సర్టిఫికెట్‌ వెరిఫికేషన్‌కు రావాలి

నిజామాబాద్‌ అర్బన్‌: డీఎస్సీ ఫలితాల్లో 1:3 పద్ధతిలో ఎంపికైన అభ్యర్థులు తప్పనిసరిగా శనివారం సాయంత్రంలోగా ధ్రువపత్రాల పరిశీలనకు హాజరు కావాలని డీఈవో దుర్గాప్రసాద్‌ గురువారం ఒక ప్రకటనలో సూచించారు. నగరంలోని నిర్మల హృదయ పాఠశాలలో సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌ కొనసాగుతోందని, 5వ తేదీ తరువాత వచ్చే వారిని పరిస్థితుల్లోనూ అనుమతించేది లేదని స్పష్టం చేశారు.

500 మంది సర్టిఫికెట్లు..

అధికారులు గురువారం 500 మంది అభ్యర్థుల సర్టిఫికెట్లను వెరిఫై చేశారు. 1:3 పద్ధతిలో ఉదయం 10 నుంచి సాయంత్రం 5గంటల వరకు పరిశీలన కొనసాగింది.

గేటు వద్ద నిలిచిన గూడ్స్‌



డిచ్‌పల్లి: డిచ్‌పల్లిలో రైలు గేటు మధ్యలో గురువారం రాత్రి గూడ్స్‌ రైలు పది నిమిషాల సేపు సాంకేతిక కారణాల వల్ల నిలిచింది. అయితే గూడ్స్‌ రైలు వస్తుందని సిబ్బంది 10 నిమిషాల ముందు రైల్వేగేటు వేశారు. దీనికి తోడు సాంకేతిక కారణాలతో రైలు నిలిచిపోవడంతో 30 నిముషాల పాటు గేటు మూసి ఉంచడంతో ఇరువైపులా భారీ సంఖ్యలో వాహనాలు నిలిచిపోయాయి. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఇలా గేటు మధ్యలో గతంలో ఒకసారి గూడ్స్‌ రైలు నిలిచిందని స్థానికులు తెలిపారు.

వన్యప్రాణి వారోత్సవాలు ప్రారంభం

- ఈ నెల 9వరకు నిర్వహించనున్న అటవీ శాఖ
- ప్రజలకు, విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు



చిన్నాపూర్‌ అర్బన్‌ పార్క్‌లో వన్య ప్రాణుల సంరక్షణపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

డొంకేశ్వర్‌: జిల్లాలో 70వ వన్యప్రాణి వారోత్సవాల నిర్వహణకు అటవీ శాఖ సిద్ధమైంది. ఈ నెల 3 నుంచి 9వ తేదీ వరకు నిర్వహించాలన్న ప్రభుత్వ ఆదేశాల మేరకు గురువారం అన్ని రేంజ్‌ల పరిధిలో కార్యక్రమాలను ప్రారంభించారు. వన్యప్రాణుల సంరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు, విద్యార్థులకు అటవీ అధికారులు అవగాహన కలిస్తున్నారు. జిల్లాలో 86,871 హెక్టార్ల విస్తీర్ణంలో అడవులు ఉన్నాయి. అడవులతో పాటు మంజీరా, ఎస్సారెస్పీ బ్యాక్‌ వాటర్‌ ప్రాంతం పచ్చికబయళ్లలో వన్య ప్రాణుల సంచారం ఎక్కువగా ఉంటుంది. అటవీ అధికారులు మొదటి రోజు ర్యాలీ నిర్వహించి స్థానిక ప్రజలతో సమావేశాలు నిర్వహించారు. వన్య ప్రాణులు, అడవుల సంరక్షణకు ఏవిధంగా పాటుపడాలో వివరించారు. అలాగే జంతువులను వేటాటడం నేరమని, వాటిని వేటాడితే చట్టప్రకారం శిక్షలుంటాయని తెలిపారు. వన్యప్రాణులు అనుకోకుండా జనసంచారంలోకి వస్తే వాటిపై దాడి చేయకుండా వెంటనే అటవీ అధికారులకు సమాచారం అందిస్తే వాటిని పట్టుకొని అడవుల్లో వదిలేస్తామని తెలిపారు.

రోజుకో కార్యక్రమం..

ఈ నెల 9వరకు రోజుకో కార్యక్రమాన్ని నిర్వహించడానికి అటవీ శాఖ ప్రణాళిక రూపొందించింది. 4న పక్షుల వీక్షణ, 5న అడవుల్లో నడక, ట్రెక్కింగ్‌, 6న విద్యార్థులకు వ్యాసరచన, డ్రాయింగ్‌, పెయింటింగ్‌, 7న పాఠశాల, కళాశాల స్థాయిలో విద్యార్థులకు అవగాహన, 8న ప్రతీ రేంజ్‌ పరిధిలో బైక్‌ర్యాలీ, 3కె రన్‌, 9న అడవుల్లో ఫీల్డ్‌ విజిట్‌, ప్రొజెక్టర్‌ ద్వారా అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

జిల్లాలో వన్యప్రాణుల వివరాలు

చిరుతలు	21	నెమళ్లు	315
ఎలుగుబంట్లు	29	నక్కలు	11
అడవి కుక్కలు	32	తోడేళ్లు	5
అడవి పిల్లులు	25	హైనాలు	3
జింకలు	295		

నేడు తెయూ సెర్చ్‌ కమిటీ సమావేశం

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్‌: తెలంగాణ యూనివర్సిటీ వైస్‌ చాన్స్‌లర్‌ నియామకం కోసం శుక్రవారం మధ్యాహ్నం 12 గంటలకు రాష్ట్ర సచివాలయంలో సమావేశం జరుగనుంది. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సమావేశ మందిరంలో నిర్వహించనున్నారు. సీఎస్‌ శాంతి కుమారి నేతృత్వంలో జరిగే ఈ సమావేశంలో సెర్చ్‌ కమిటీ సభ్యులైన యూజీసీ నామినీ, హిమాచల్‌ప్రదేశ్‌ లోని వైఎస్‌ పార్మర్‌ హార్టికల్చరల్‌ యూనివర్సిటీ ఉప కులపతి రాజేశ్వర్‌ సింగ్‌ చందేల్‌, యూనివర్సిటీ ఈసీ నామినీగా ఉస్మానియా యూనివర్సిటీ విశ్రాంత ఆచార్యులు సులేమాన్‌ సిద్ధికి పాల్గొననున్నారు. ఈసారి వీసీల నియామకాల్లో అర్హతలు, అనుభవాన్ని పరిగణనలోకి తీసుకునేందుకు గాను ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉండడంతో కొందరి ఆశలు సన్నగిల్లినట్లు తెలుస్తోంది.

- వీసీల నియామకం విషయంలో కొన్ని సాంకేతిక సమస్యల కారణంగా జాప్యం జరుగుతోంది. ఈ నెల 4న జరగాల్సిన డాక్టర్‌ బీఆర్‌ అంబేద్కర్‌ ఓపెన్‌ యూనివర్సిటీ సెర్చ్‌ కమిటీ సమావేశం ఈ నెల 9న జరుగనుంది. దీంతో రాష్ట్రంలో అన్ని వర్సిటీల వీసీల నియామక ఉత్తర్వులు ఈ నెల 12న ఇవ్వనున్నట్లు సమాచారం.
- తెలంగాణ వర్సిటీ నుంచి ఇద్దరు విశ్రాంత ఆచార్యులు, మరో ఐదుగురు ప్రస్తుతం పనిచేస్తున్న వారు దరఖాస్తు చేసుకున్నారు. మాజీ వీసీ రవీందర్‌ గుప్తా హయాంలో అధికారంలో ఉండి విచ్చలవిడిగా అవినీతి అక్రమాలకు పాల్పడిన ఇద్దరు ఆచార్యులపై (వీరిలో ఒకరు మహిళ) విజిలెన్స్‌ కేసులు ఉండటంతో వారి పేర్లు పరిగణనలోకి తీసుకోలేదని తెలుస్తోంది. దీన్ని కప్పిపుచ్చుకునేందుకు సదరు ప్రొఫెసర్‌ జిల్లాకు చెందిన ఒక మధ్యవర్తి ద్వారా స్థానిక ఎమ్మెల్యే నుంచి అదే సామాజిక వర్గానికి చెందిన మంత్రి వరకు వెళ్లినట్లు తెలిసింది. ఇటీవల మహబూబ్‌నగర్‌ జిల్లాకు చెందిన ఓ మాజీ ఎమ్మెల్యేను కలిసి తనకు వీసీ పదవి దక్కేలా చూడాలని కోరినట్లు తెలిసింది. కాగా తెయూ నుంచి దరఖాస్తులు చేసుకున్న వారిలో కామర్స్‌ విభాగానికి చెందిన ప్రొఫెసర్‌కు అవకాశం ఉన్నప్పటికీ ఇటీవల ఆయన తీసుకున్న కొన్ని నిర్ణయాలపై ఇంటెలిజెన్స్‌ నిఘా పెట్టడంతో ఫలితం ఎలా ఉంటుందో చూడాలి.

స్వచ్ఛత జీవన విధానం కావాలి

- రైల్వే ఏడీఎఫ్‌ఎం సాల్వన్‌ సంగ



ప్లాట్‌ ఫాంను శుభ్రం చేస్తున్న అధికారులు

ఖలీల్‌వాడి: స్వచ్ఛత ప్రతి ఒక్కరి జీవన విధానం కావాలని హైదరాబాద్‌ రైల్వే అసిస్టెంట్‌ డివిజనల్‌ ఫైనాన్స్‌ మేనేజర్‌ సాల్వన్‌ సంగ తెలిపారు. గురువారం నిజామాబాద్‌ జంక్షన్‌ రైల్వే స్టేషన్‌లో గురువారం 'స్వచ్ఛతా హీ సేవ'లో భాగంగా రైల్వే స్టేషన్‌ ప్లాట్‌ ఫామ్‌, రైల్వే ట్రాక్‌, పలు ప్రదేశాల్లో శ్రమదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'స్వచ్ఛతా హీ సేవ'ను ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలన్నారు. ఒక్కరోజు కార్యక్రమంలా కాకుండా నిరంతం కొనసాగించాలన్నారు. అపరిశుభ్ర పరిసరాల నుంచి పరిశుభ్రత దిశగా, అనారోగ్యం నుంచి ఆరోగ్య దిశగా, కాలుష్యం నుంచి స్వచ్ఛత దిశగా దేశాన్ని ముందుకు నడిపించే మహత్తర కార్యక్రమం స్వచ్ఛతా హీ సేవ అని అన్నారు. కార్యక్రమంలో సెంట్రల్‌ బ్యూరో ఆఫ్‌ కమ్యూనికేషన్‌ ఫీల్డ్‌ పబ్లిసిటీ ఆఫీసర్‌ బి ధర్మానాయక్‌, నిజామాబాద్‌ రైల్వే స్టేషన్‌ మేనేజర్‌ సదాశివుడు, హెల్త్‌ ఇన్‌స్పెక్టర్‌ ప్రేమ సాగర్‌, నెహ్రూ యువ కేంద్రం జిల్లా యువజన అధికారిణి శైలి బెల్లాల్‌, అసిస్టెంట్‌ డివిజనల్‌ మెడికల్‌ ఆఫీసర్‌ దీప, కమర్షియల్‌ ఇన్‌స్పెక్టర్‌ లక్ష్మణ్‌, సీనియర్‌ సెక్షన్‌ ఇంజినీర్‌ ఉదయ్‌, నిజామాబాద్‌ జంక్షన్‌ రైల్వే సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం సేకరణకు విస్తృత ఏర్పాట్లు

- రైతులను మోసగిస్తే క్రిమినల్‌ కేసులు
- ఫిర్యాదుల స్వీకరణకు కంట్రోల్‌ రూమ్‌లు



వీసీలో పాల్గొన్న కలెక్టర్‌, అదనపు కలెక్టర్లు, సీపీ

నిజామాబాద్‌ అర్బన్‌: ఖరీఫ్‌ ధాన్యం కొనుగోలు ప్రక్రియ సజావుగా సాగేలా ప్రణాళికాబద్ధంగా కృషి చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. ఎక్కడ కూడా రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికతో అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వర్‌ రావు, సీతక్క, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, డీజీపీ జితేందర్‌, పౌర సరఫరాల శాఖ కమిషనర్‌ డీఎస్‌ చౌహాన్‌ తదితరులతో కలిసి సీఎం రేవంత్‌రెడ్డి గురువారం సాయంత్రం వీడియో కాన్ఫరెన్స్‌ ద్వారా ధాన్యం కొనుగోళ్లు, ఉపాధ్యాయ నియామక ప్రక్రియపై దిశానిర్దేశం చేశారు. దొడ్డు, సన్నరకం ధాన్యం కొనుగోళ్ల కోసం వేర్వేరుగా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఏ గ్రేడ్‌ ధాన్యం క్వింటాలుకు రూ.2,320, సాధారణ రకానికి రూ.2,300 చొప్పున కనీస మద్దతు ధర చెల్లించడంతోపాటు, సన్న రకానికి అదనంగా రూ.500 చొప్పున బోనస్‌ అందిస్తామన్నారు. ఇతర రాష్ట్రాల నుంచి సన్నరకం ధాన్యం రాకుండా గట్టి నిఘా ఏర్పాటు చేయాలని, పోలీసుశాఖ అధికారయంత్రాంగంతో సమన్వయం చేసుకోవాలన్నారు. రైతును మోసగించేందుకు, నష్టపర్చేందుకు ప్రయత్నించే వారిని ఉపేక్షించొద్దని, క్రిమినల్‌ కేసులు నమోదు చేయాలన్నారు. రైతుల ఫిర్యాదులు స్వీకరించేందుకు టోల్‌ ఫ్రీ నంబర్‌ ఏర్పాటు చేయాలని సూచించారు. సన్నరకం ధాన్యం సాగుచేసేలా రైతులను ప్రోత్సహించాలన్నారు.

డీఎస్సీపై..

డీఎస్సీ–2024 భర్తీల నేపథ్యంలో సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌ను ఈ నెల 5వ తేదీలోగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ నెల 9న హైదరాబాద్‌లోని లాల్‌ బహదూర్‌ స్టేడియంలో నియామకపత్రాలు అందజేయనున్నట్లు సీఎం తెలిపారు. వీసీలో కలెక్టర్‌ రాజీవ్‌ గాంధీ హనుమంతు, పోలీస్‌ కమిషనర్‌ కల్మేశ్వర్‌, అదనపు కలెక్టర్లు అంకిత్‌, కిరణ్‌కుమార్‌, డీఆర్డీవో సాయాగౌడ్‌, డీఎస్‌వో అరవింద్‌రెడ్డి, సివిల్‌ సప్లయిస్‌ డీఎం రమేశ్‌, డీసీవో శ్రీనివాస్‌, మార్కెటింగ్‌ శాఖ అధికారి గంగుబాయి, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఫ్యామిలీ డిజిటల్‌ కార్డు సర్వే షురూ



సాంపల్లిలో సర్వేను పరిశీలిస్తున్న కలెక్టర్‌

నిజామాబాద్‌అర్బన్‌: జిల్లాలో ఫ్యామిలీ డిజిటల్‌ కార్డుల సర్వే ప్రారంభమైంది. పైలెట్‌ ప్రాజెక్టుగా ఎంపిక చేసిన ప్రాంతాల్లో గురువారం జిల్లా యంత్రాంగం సర్వేను చేపట్టింది. ఆర్మూర్‌ పట్టణంలోని రెండో వార్డు, అదే నియోజకవర్గంలోని రాంపూర్‌, బాల్కొండ నియోజకవర్గం పరిధిలోని శ్రీరాంపూర్‌, భీమ్‌గల్‌ పట్టణంలోని ఏడో వార్డు, బోధన్‌ నియోజకవర్గంలోని లంగ్డాపూర్‌, బోధన్‌ పట్టణంలోని 25వ వార్డు, నిజామాబాద్‌ మున్సిపల్‌ కార్పొరేషన్‌ పరిధిలోని 45, 38, 3 డివిజన్‌లలో, నిజామాబాద్‌ రూరల్‌ నియోజకవర్గంలోని సాంపల్లిలో సర్వే నిర్వహించారు. కలెక్టర్‌ రాజీవ్‌గాంధీ హనుమంతు సాంపల్లి, ఆర్మూర్‌ పట్టణంలో సర్వేను పర్యవేక్షించా రు. సర్వేను పకడ్బందీగా చేపట్టాలన్నారు. మిగతా ప్రాంతాల్లో ఆర్డీవోలు, నిజామాబాద్‌నగరంలో మున్సిపల్‌ కమిషనర్‌ మకరందు సర్వేను పర్యవేక్షించారు. నిజామాబాద్‌ నగరంలో సర్వే కోసం అదనంగా అదనంగా సిబ్బందిని కేటాయించారు. ఈ నెల ఏడో తేదీలోగా సర్వే పూర్తి చేయాలని ఆదేశాలు జారీ కావడంతో పకడ్బందీగా చేపడుతున్నారు.

నేడు పీసీసీ చీఫ్‌ సన్మాన సభ

- ఎనిమిది మంది మంత్రుల రాక
- బోర్గాం(పి) నుంచి పాత కలెక్టరేట్‌ వరకు ర్యాలీ
- కాంగ్రెస్‌ శ్రేణులు పెద్ద ఎత్తున తరలిరావాలి
- విలేకరుల సమావేశంలో డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్‌ రెడ్డి



మాట్లాడుతున్న డీసీసీ అధ్యక్షుడు మోహన్‌రెడ్డి

ఖలీల్‌వాడి: పీసీసీ అధ్యక్ష బాధ్యతలు స్వీకరించిన తరువాత మొదటిసారి జిల్లాకు వస్తున్న ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్‌గౌడ్‌కు శుక్రవారం సన్మాన సభను జిల్లా కేంద్రంలోని పాత కలెక్టరేట్‌ గ్రౌండ్‌లో నిర్వహించనున్నట్లు డీసీసీ అధ్యక్షుడు, రాష్ట్ర కో ఆపరేటీవ్‌ యూనియన్‌ లిమిటెడ్‌ చైర్మన్‌ మానాల మోహన్‌రెడ్డి తెలిపారు. గురువారం సన్మాన సభ ఏర్పాట్లను పరిశీలించిన అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. మహేశ్‌కుమార్‌గౌడ్‌ ఎన్‌ఎస్‌యూఐ నుంచి అంచెలంచెలుగా ఎదిగి పీసీసీ పగ్గాలు చేపట్టారని, కష్టపడి పనిచేసే ప్రతి ఒక్కరికీ పార్టీలో గుర్తింపు ఉంటుందనేందుకు ఆయన నిదర్శనమన్నారు. పీసీసీ అధ్యక్షుడు మధ్యాహ్నం ఒంటి గంటకు మాధవనగర్‌ సాయిబాబా ఆలయానికి చేరుకుంటారని, బోర్గాం(పి) నుంచి వినాయక్‌నగర్‌ హనుమాన్‌ చౌరస్తా మీదుగా పులాంగ్‌, దేవీటాకీస్‌ చౌరస్తా, ఎల్లమ్మగుట్ట కమాన్‌ మీదుగా పాత కలెక్టరేట్‌ గ్రౌండ్‌కు స్వాగత ర్యాలీ చేరుకుంటుందన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, అనుబంధ సంఘాల నాయకులు పెద్ద ఎత్తున తరలిరావాలని ఆయన కోరారు. సన్మానసభకు వచ్చే వాహనాలను పాత కలెక్టరేట్‌ స్థలం, ఎల్లమ్మగుట్ట కమాన్‌ వద్ద, పాత ఎండీవో కార్యాలయం ప్రాంతాల్లో పార్కింగ్‌ చేయాలని సూచించారు. ట్రాఫిక్‌ సమస్య తలెత్తకుండా సహకరించాలని ఆయన కోరారు. సమావేశంలో ఉర్దూ అకాడమీ చైర్మన్‌ తాహెర్‌ బిన్‌హందాన్‌, నగర కాంగ్రెస్‌ అధ్యక్షుడు కేశ వేణు, సీనియర్‌ నాయకులు గడుగు గంగాధర్‌, బాడ్సి శేఖర్‌గౌడ్‌, నరాల రత్నాకర్‌, రామర్తి గోపి, విక్కీయాదవ్‌, బోర్గాం శ్రీనివాస్‌, వైశాఖ సంతోష్‌, రాజ నరేందర్‌గౌడ్‌, బొబ్బిలి రామకృష్ణ, సత్యనారాయణగౌడ్‌, వేణురాజ్‌, విపుల్‌గౌడ్‌, అష్రఫ్‌ తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్‌ మళ్లింపు..

కాంగ్రెస్‌ స్వాగత ర్యాలీ, సన్మానసభ నేపథ్యంలో శుక్రవారం మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సాయంత్రం 4గంటల వరకు ట్రాఫిక్‌ మళ్లింపు ఉంటుందని ఏసీపీ రాజావెంకట్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

- నిజామాబాద్‌ నుంచి బోధన్‌ వైపు వెళ్లే ఆర్టీసీ బస్సులు ఫ్లై ఓవర్‌, శ్రద్ధానంద్‌ గంజ్‌, అర్సపల్లి ఎక్స్‌ రోడ్డు నుంచి వెళ్లాలి.
- బోధన్‌ నుంచి నిజామాబాద్‌ వైపు వచ్చే ఆర్టీసీ బస్సులు అర్సపల్లి ఎక్స్‌ రోడ్డు, న్యూ కలెక్టరేట్‌, కంఠేశ్వర్‌ బైపాస్‌, రైల్వే స్టేషన్‌, ఎన్టీఆర్‌ చౌరస్తా మీదుగా బస్టాండ్‌కు వెళ్లాలి.

మధ్యాహ్నం 2 నుంచి 4గంటల వరకు భారీ వాహనాలు..

- బోధన్‌ వైపు వెళ్లే భారీ వాహనాలు మాధవనగర్‌, కంఠేశ్వర్‌ బైపాస్‌, కలెక్టరేట్‌, అర్సపల్లి ఎక్స్‌ రోడ్డు, బోధన్‌ వైపు వెళ్లాల్సి ఉంటుంది.
- బోధన్‌ నుంచి హైదరాబాద్‌ వైపు వెళ్లే వాహనాలు అర్సపల్లి ఎక్స్‌ రోడ్డు, న్యూ కలెక్టరేట్‌, కంఠేశ్వర్‌ బైపాస్‌ మీదుగా మాధవనగర్‌ వైపు వెళ్లాలి.
- బాన్సువాడ నుంచి హైదరాబాద్‌ వైపు వెళ్లే వాహనాలు వర్ని చౌరస్తా, ఖిల్లా రోడ్డు, బోధన్‌ బస్టాండ్‌, అర్సపల్లి ఎక్స్‌ రోడ్డు, న్యూ కలెక్టరేట్‌, కంఠేశ్వర్‌ బైపాస్‌, మాధవనగర్‌ వైపు వెళ్లాలి.

నైపుణ్యాభివృద్ధికే డ్యూటీ మీట్‌



బాసర జోన్‌ డ్యూటీ మీట్‌లో పాల్గొన్న అధికారులు

ఖలీల్‌వాడి: పోలీసుల పనితీరుని మెరుగుపర్చేందులు పోలీస్‌ డ్యూటీ మీట్‌లు ఎంతో దోహదపడతాయని సీపీ కల్మేశ్వర్‌ అన్నారు. ఈ మేరకు గురువారం జిల్లా కేంద్రంలోని పోలీస్‌ హెడ్‌ క్వార్టర్స్‌ గ్రౌండ్‌, పోలీస్‌ కమాండ్‌ కంట్రోల్‌ కార్యాలయం, పోలీస్‌ కార్యాలయంలో సీఐలు, ఎస్సైలు, సిబ్బందికి బాసర జోన్‌ డ్యూటీ మీట్‌ నిర్వహించారు. నిజామాబాద్‌, జగిత్యాల్‌, నిర్మల్‌, ఆదిలాబాద్‌ జిల్లాలకు చెందిన పోలీసులకు నేర పరిశోధన, డాగ్‌ స్క్వాడ్‌ పనితనం, ఫింగర్‌ ప్రింట్‌ పరిశోధన, బాంబ్‌ డిస్పోజల్‌ టీం విధులు, కంప్యూటర్‌పై నైపుణ్యం, అవాంఛనీయ ఘటనల్లో వీడియోగ్రఫీ చేయు విధానం, సైంటిఫిక్‌ ఇన్వెస్టిగేషన్‌, పలు అంశాల్లో రాత పరీక్ష చేపట్టారు. మంచి ప్రతిభ కనబర్చిన వారిని రాష్ట్ర స్థాయిలో నిర్వహించే డ్యూటీ మీట్‌ కార్యక్రమానికి పంపనున్నట్లు పేర్కొన్నారు. ఈ పరీక్షలు రెండు రోజుల పాటు ఉంటాయన్నారు. కార్యక్రమంలో డీసీపీ (అడ్మిన్‌)కోటేశ్వర రావు, అదనపు డీసీపీ (ఏఆర్‌) శంకర్‌ నాయక్‌, సీసీఎస్‌, ఏసీపీ నాగేంద్ర చారి, సీసీఆర్‌బీ ఏసీపీ రవీందర్‌ రెడ్డి, ఫోరెన్సిక్‌ హెచ్‌వోడీ నాగమోహన్‌, సీసీఎస్‌ వీ సురేష్‌, సీటీ సీసీఐ శివరాం, సైబర్‌ క్రైమ్‌ సీఐ ముఖీద్‌ పాషా, జగిత్యాల్‌, నిజామాబాద్‌, నిర్మల్‌, ఆదిలాబాద్‌ సీఐలు, ఎస్సైలు తదితరులు పాల్గొన్నారు.

నేడు జిల్లాకు రానున్న మంత్రి దామోదర

నిజామాబాద్‌నాగారం: రాష్ట్ర వైద్యశాఖమంత్రి దామోదర రాజనర్సింహ జిల్లాకు శుక్రవారం రానున్నారు. బేగంపేట్‌ నుంచి మధ్యాహ్నం 12.15 నిమిషాలకు హెలికాప్టర్‌ ద్వారా బయలు దేరి 1 గంటకు జిల్లాకు చేరుకోనున్నారు. జిల్లాలో చేపట్టిన పలు కార్యక్రమాల అనంతరం సాయంత్రం 5గంటల ప్రాంతంలో బేగంపేట్‌కు చేరుకుంటారు.

నీటి విడుదల నిలిపివేత

బాల్కొండ: ఎస్సారెస్పీ నుంచి వరద కాలువ ద్వారా నీటి విడుదలను ప్రాజెక్ట్‌ అధికారులు నిలిపి వేశారు. ఎగువ ప్రాంతాల నుంచి వరద తగ్గుముఖం పట్టడంతో గురువారం వరద గేట్ల ద్వారా గోదావరిలోకి నీటి విడుదలను నిలిపి వేశారు. ఎగువ ప్రాంతాల నుంచి 8525 క్యూసెక్కుల వరద వచ్చి చేరుతోంది. ప్రాజెక్ట్‌ నుంచి కాకతీయ కాలువ ద్వారా 6800, లక్ష్మి కాలువ ద్వారా 150, సరస్వతి కాలువ ద్వారా 500, గుత్ప లిఫ్ట్‌ ద్వారా 135, ఆవిరి రూపంలో 709 క్యూసెక్కుల నీరు పోతోంది. ప్రాజెక్ట్‌ పూర్తి స్థాయి నీటి మట్టం 1091(80.5 టీఎంసీలు) అడుగులు కాగా గురువారం సాయంత్రానికి ప్రాజెక్ట్‌లో అంతే స్థాయి నీటి మట్టంతో ప్రాజెక్ట్‌ నిండుకుండలా ఉంది.

నేటి నుంచి రోడ్లపైకి ఎలక్ట్రిక్‌ బస్సులు

- నిజామాబాద్‌కు చేరుకున్న 13 బస్సులు
- చార్జింగ్‌ కోసం ప్రత్యేక ఏర్పాట్లు
- ప్రారంభించనున్న రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌



ఖలీల్‌వాడి: డీజిల్‌ భారాన్ని తగ్గించుకోవడంతోపాటు కాలుష్య రహిత సేవలు అందించడమే లక్ష్యంగా ఆర్టీసీ ఎలక్ట్రికల్‌ బస్సులను తీసుకువచ్చింది. ఉమ్మడి నిజామాబాద్‌ జిల్లాకు 64 బస్సులు రావాల్సి ఉండగా మొదటి దఫాలో నిజామాబాద్‌–2 డిపోనకు 13 బస్సులు చేరాయి. ఎలక్ట్రిక్‌ బస్సులు రావడంతో చార్జింగ్‌ కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు. రాష్ట్ర రోడ్డు రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ బస్సులను శుక్రవారం ప్రారంభించనున్నారు. నేటి నుంచి ఆధునిక వసతులు కలిగిన ఎలక్ట్రికల్‌ బస్సులు రోడ్లపైకెక్కనున్నాయి.

ప్రత్యేకతలు..

42 సీట్ల(డ్రైవర్‌ సీటుతో సహా) సామర్థ్యం ఉన్న ఈ బస్సుల్లో నాలుగు సీసీ కెమెరాలున్నాయి. ప్రత్యేక మైన వాకీటాకీల ద్వారా డ్రైవర్‌ ప్రయాణికులతో సమన్వయం చేసుకోవచ్చు. పూర్తిగా సెన్సార్‌ సిస్టంతో బస్సులు నడుస్తాయి. బస్సుకు మూడు వైపులా ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన ఎలక్ట్రిక్‌ సిస్టం బోర్డుల్లో స్టేజీల వివరాలు ఎప్పటికప్పుడు డిస్‌ప్లే అవుతాయి. ప్రతి సీటు వద్ద అలారం, మొబైల్‌ చార్జింగ్‌ సౌకర్యం ఉంటుంది.

నిజామాబాద్‌ నుంచి జేబీఎస్‌

ఎలక్ట్రిక్‌ బస్సులు నిజామాబాద్‌ – జేబీఎస్‌ మధ్య నడుపుతాం. విడలవారీగా వచ్చే బస్సులను కరీంనగర్‌, ఆదిలాబాద్‌, వరంగల్‌ వంటి ప్రాంతాలకు నడుపుతాం. నిజామాబాద్‌ నుంచి జేబీఎస్‌కు పెద్దలకు రూ.360, పిల్లలకు రూ.230 టిక్కెట్‌ ఉంటుంది.

– జానీరెడ్డి, ఆర్‌ఎం, నిజామాబాద్‌

రైతుల అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయం



కల్దుర్కిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుదర్శన్‌ రెడ్డి

బోధన్‌: రైతుల అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయమని మాజీ మంత్రి, బోధన్‌ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి అన్నారు. బోధన్‌ మండలంలోని కల్దుర్కి సొసైటీ ఆవరణలో మార్క్‌ఫెడ్‌, నాఫెడ్‌ సహకారంతో గురువారం ఏర్పాటు చేసిన సోయా కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి రాష్ట్ర మార్క్‌ఫెడ్‌ చైర్మన్‌ మార గంగారెడ్డి, ఏఎంసీ చైర్‌పర్సన్‌ అంకు సంధ్య దామోదర్‌తో కలిసి ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మూతపడిన నిజాంషుగర్‌ ఫ్యాక్టరీని తెరిపించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని అన్నారు. ఫ్యాక్టరీ బ్యాంకు బకాయిలు రూ.400 కోట్ల వరకు ఉండగా వాటిని చెల్లించడం జరుగుతోందన్నారు. గత ప్రభుత్వం ఫ్యాక్టరీని స్వాధీనం చేసుకుంటామని హామీ ఇచ్చి విస్మరించిందని అన్నారు. హైదరాబాద్‌ నగరంలో పేదల ఇళ్లు కూల్చుతున్నారని మాజీ మంత్రి కేటీఆర్‌, హరీశ్‌రావులు రాద్ధాంతం చేస్తున్నారని ఆరోపించారు. ఏఎంసీ వైస్‌ చైర్మన్‌ చీల శంకర్‌, డీసీసీబీ డైరెక్టర్లు శరత్‌, గిర్దావర్‌ గంగారెడ్డి, టీపీసీసీ డెలిగెట్‌ గంగాశంకర్‌, నాయకులు అంతిరెడ్డి రాజిరెడ్డి, నాయకులు పాషా మొహినొద్దీన్‌, అల్లె రమేశ్‌ తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

సాలూర, హున్సా సొసైటీల్లో ఏర్పాటు చేసిన సోయా కొనుగోలు కేంద్రాలను రాష్ట్ర మార్క్‌ఫెడ్‌ చైర్మన్‌ మార గంగారెడ్డి, ఏఎంసీ చైర్‌పర్సన్‌ అంకు సంధ్య, వైస్‌ చైర్మన్‌ చీల శంకర్‌తో కలిసి ప్రారంభించారు. సొసైటీల చైర్మన్లు అల్లె జనార్దన్‌, మందర్న రవి, సీఈవోలు బస్వంత్‌రావు పటేల్‌, హన్మంత్‌రావు, డైరెక్టర్లు, రైతులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్‌

యువకుడి అదృశ్యం

ఖలీల్‌వాడి: నగరంలోని పవన్‌నగర్‌కు చెందిన నరేశ్‌ అనే యువకుడు అదృశ్యమైనట్లు మూడో టౌన్‌ ఎస్సై మహేశ్‌ గురువారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. నరేశ్‌ సెప్టెంబర్‌ 30న ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబీకులు పలు చోట్ల గాలించినా ఆచూకీ లభించలేదు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

11 మందిపై కేసు నమోదు

మోపాల్‌: మండలంలోని కులాస్‌పూర్‌ తండాకు చెందిన 11 మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై యాదగిరిగౌడ్‌ గురువారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి ఆనుకుని ఉన్న ఫారెస్ట్‌ భూమిని చదును చేసేందుకు తండాకు చెందిన ప్రజలు ప్రయత్నం చేశారు. విషయం తెలిసిన ఫారెస్ట్‌ అధికారులు బుధవారం అర్ధరాత్రి అక్కడికి చేరుకుని అడ్డుకున్నారు. ఈక్రమంలో గిరిజనులు ఫారెస్ట్‌ అధికారులపై తిరగబడి, బెదిరింపులకు పాల్పడ్డారు. ఫారెస్ట్‌ సెక్షన్‌ ఆఫీసర్‌ సాయికుమార్‌ ఫిర్యాదు మేరకు 11మందిపై కేసు నమోదు చేశామని, మరికొందరిని గుర్తించే పనిలో ఉన్నామని ఎస్సై పేర్కొన్నారు.

ఆగిఉన్న లారీని ఢీకొని ఒకరి మృతి



ప్రసాద్‌ మృతదేహం

మాక్లూర్‌: రోడ్డుపై ఆగి ఉన్న లారీని ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి చెందిన ఘటన మాక్లూర్‌ మండలంలోని అడవి మామిడిపల్లి శివారులో గురువారం చోటు చేసుకుంది. ఎస్సై రాజశేఖర్‌ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని గుత్ప గ్రామానికి చెందిన కల్లెడి ప్రసాద్‌(36) జిల్లా కేంద్రంలోని ద్వారకా మై టిఫిన్‌ సెంటర్‌లో వంట మనిషిగా పనిచేస్తున్నాడు. పని ముగించుకొని స్వగ్రామానికి బైక్‌పై వస్తుండగా అడవి మామిడిపల్లి శివారులోని జాతీయ రహదారిపై ఆగి ఉన్న లారీని ఢీకొన్నాడు. ఈ ఘటనలో అతనికి తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి తమ్ముడు కల్లెడి శంకర్‌ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

పాముకాటుతో మహిళ..



గంగబాయి మృతదేహం

బోధన్‌రూరల్‌: సాలూర మండలంలోని తగ్గెల్లి గ్రామానికి చెందిన సిరిగిరి గంగబాయి(62) పాముకాటుతో మృతి చెందినట్లు బోధన్‌ రూరల్‌ ఏఎస్సై రవీందర్‌ తెలిపారు. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గంగాబాయి తన పొలంలో పనులు చేస్తుండగా గురువారం మధ్యాహ్నం పాముకాటుకు గురైంది. చికిత్స నిమిత్తం బోధన్‌ జిల్లా ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతురాలి కుమారుడు దేవ్‌రావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై పేర్కొన్నారు.

ప్రేమ జంటకు వేధింపులు

నవీపేట: నవీపేట శివారులో బుధవారం రాత్రి ప్రేమ జంటను వేధించిన ఘటనలో ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వినయ్‌ తెలిపారు. జగిత్యాల జిల్లా రాయికల్‌కు చెందిన ప్రేమ జంట బైక్‌పై బుధవారం రాత్రి బాసర వైపు బయలు దేరారు. మార్గమధ్యలో నవీపేట శివారులో రహదారి పక్కన ఆగారు. అదే సమయంలో నవీపేటకు చెందిన ఇద్దరు యువకులు ప్రేమజంటను నిలదీశారు. ఫొటోలు తీస్తున్నట్లు భయపెట్టారు. బ్లాక్‌మెయిల్‌ చేసేందుకు యత్నించారు. దీంతో ప్రేమ జంట గురువారం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో నవీపేటకు చెందిన ఇద్దరి ఆకతాయిలపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. ప్రజలను ఎవరినైనా ఇబ్బందులకు గురిచేస్తే వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు.